క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి.. పింఛను ఇచ్చి..



ఆస్పత్రిలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న వలంటీర్ పుష్ప

పిఠాపురం: మండలంలోని చిత్రాడకు చెందిన సిగటాపు అమ్మాజీ అనే వృద్ధురాలికి స్థానిక వలంటీర్ సిగటాపు పుష్ప, కన్వీనర్ సి.శివ అందించారు. ఆమె ఇంటికి వెళ్లగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు. దీంతో ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేశారు.

భలే మత్స్య చౌక బేరమూ..

● రూ.20 లక్షలకు పైగా వ్యాపారం



వలలకు చిక్కిన మత్స్య సంపద

కొత్తపల్లి: అమినాబాద్ గ్రామ శివారు మినీ హార్బర్‌లో శుక్రవారం మత్స్యకారుల వలకు భారీ మత్స్య సంపద చిక్కింది. రూ.25 వేల నుంచి రూ.లక్ష విలువైన రొయ్యలు, చేపలు చిక్కాయి. వీటిని వ్యాపారులు తమిళనాడు, కేరళ, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నామని వ్యాపారులు తెలిపారు. ఈ మధ్య కాలంలో ఇంత వ్యాపారం జరగడం ఇదే మొదటిసారి అని వారు ఆనందం వ్యక్తం చేశారు.

గృహ నిర్మాణాలు వేగంగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ శ్రీనివాస్

కొత్తపల్లి: ప్రభుత్వ లే అవుట్‌లలో గృహ నిర్మాణాలను త్వరిగా చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని హౌసింగ్ డీఈ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం గృహ నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వారికి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ భాస్కరరావు పాల్గొన్నారు.


నేడు కుంతీమాధవస్వామి రథోత్సవం



పొన్న వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం

పిఠాపురం: కుంతీమాధవ కల్యాణోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం పొన్న వాహనంపై గ్రామోత్సవం నిర్వహించగా పలువురు భక్తులు స్వామివార్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి దివ్య రథోత్సవం శనివారం రాత్రి నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఐదు రోజులుగా విశేష అలంకారంలలో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తున్నారు. కల్యాణం సందర్భంగా విశేష ఆభరణాలతో స్వామి కొలువై ఉన్నారు.

అపర్ణాదేవిని దర్శించుకున్న అవికా గోర్



అపర్ణాదేవిని దర్శించుకుంటున్న అవికా గోర్

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణాదేవి అమ్మవారిని చిన్నారి పెళ్లికూతురు టీవీ సీరియల్ ఫేం, సినీ నటి అవికా గోర్ శుక్రవారం దర్శించుకున్నారు. పాప్‌కార్న్ సినిమాకు ఆమె సహ నిర్మాతగా వ్యవహరిస్తుండడంతో ఆ చిత్ర యూనిట్‌తో కలసి ఆమె ఆలయానికి వచ్చారు. ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. చిత్ర దర్శకుడు మురళి, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

చకచకా హార్బర్ నిర్మాణం

● 53 ఎకరాల్లో రూ.424 కోట్లతో నిర్మాణం
● ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మందికి ఉపాధి
● ఏడాది చివరికి పూర్తయ్యే అవకాశం



టెట్రాపాడ్స్ (గోడలకు రక్షణగా వేసే కాంక్రీట్ త్రికోణ రాళ్లు)



సముద్రంలో నిర్మిస్తున్న సౌత్ బ్రేక్ వాటర్‌వాల్

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాద్ తీరంలో చేపట్టిన ఉప్పాడ మేజర్ హార్బర్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో దీనికి శంకుస్థాపన చేశారు. రూ.424 కోట్లతో గురురాఘవేంద్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఈ పనులు చేపట్టింది. సుమారు 53 ఎకరాల్లో ల్యాండ్ ఫిల్లింగ్, సముద్రంలో స్టోన్ ఫిల్లింగ్ (నార్త్, సౌత్ బ్రేక్ వాటర్ వాల్స్), కెరటాల తాకిడిని అడ్డుకునే టెట్రాపాడ్స్, మత్స్యకారులు విశ్రాంతి తీసుకునే భవనం, పోర్టుస్టేషన్, పెట్రోలు బంకు వంటి భవన నిర్మాణ పనులను చేపట్టారు. సుమారు 2,500 బోట్లు నిలుపుకొనే సౌకర్యం, సుమారు 50వేల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి కలగనున్నాయి. ఈ ఏడాది చివరినాటికి హార్బర్ నిర్మాణం పూర్తవుతుందని సంస్థ ప్రతినిధులు చెప్తున్నారు.

వైఎస్ కుటుంబానికి రుణపడి ఉంటాం



ఈ హార్బర్ నిర్మాణంతో మా కుటుంబాల జీవన ప్రమాణాల్లో మెరుగైన మార్పు వస్తుంది. హార్బర్ ప్రతిపాదనను దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి మొదలుపెడితే, ఆయన తనయుడు పూర్తిచేస్తున్నారు. ఆయన కుటుంబానికి తామెంతో రుణపడి ఉంటాం.

– ఉమ్మిడి యోహాన్, మత్స్యకార నాయకుడు, ఉప్పాడ

కళా తపస్వితో అనుబంధం



నవరలో కె.విశ్వనాథ్‌కు కళాకృతి అందించి సత్కరించిన ప్రజలు (ఫైల్)

సామర్లకోట: సినీ దర్శకుడు, నటుడు, కళా తపస్వి కె.విశ్వనాథ్‌కు సామర్లకోట మండలం నవర గ్రామంతో అనుబంధం ఉంది. దాదా సాహెబ్ అవార్డు అందుకున్న సందర్భంగా కాకినాడ కళాకారుల పిలుపు మేరకు ఆయన పూర్వపు జిల్లాలో అడుగు పెట్టారు. అయితే కాకినాడ వచ్చే ముందు నవర గ్రామంలో తన మిత్రుడు కార్పెంటర్ గెద్దనాపల్లి సత్యలింగంను కలుసుకున్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ తల్లిదండ్రులు సరస్వతి, సుబ్రహ్మణ్యంల చిత్రాలను టేకు చెక్కపై చెక్కి ఆయనకు అందజేసి సత్కరించారు. కె.విశ్వనాథ్ ఇంట్లో ప్రతి కలప సామగ్రిని సత్యలింగం తయారు చేశారు. ఆనాటి జ్ఞాపకాలను గ్రామ ప్రజలు నెమర వేసుకున్నారు.

కొట్లాట కేసులో రూ.3 వేల జరిమానా

పిఠాపురం: సామాన్లు తోమిన మురికి నీరు మీద పడిందని ఇటుక బెడ్డుతో దాడి చేసి గాయపర్చిన మహిళకు రూ 3వేలు జరిమానా విధిస్తూ పిఠాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి సుధారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. 2018వ సంవత్సరంలో గొల్లప్రోలు ఈబీసీ కాలనీకి చెందిన ఆర్ వీరరాఘవమ్మ అదే ప్రాంతానికి చెందిన ఎం.రాజ్యలక్ష్మి, ఆమె భర్త తిరుపతిరావులపై ఇటుక బెడ్డతో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ముద్దాయిని కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువు కావడంతో ఆమెకు రూ 3వేల జరిమానా విధించారు. ఆకుల లీలా నాగ రోజా ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

జిల్లా స్థాయి భజన పోటీలు ప్రారంభం



వేట్లపాలెంలో జిల్లా స్థాయి భజన పోటీల్లో పాల్గొన్న సభ్యులు

సామర్లకోట: వేట్లపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం ఉమ్మడి జిల్లా స్థాయి భజన పోటీలు ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద గత నెల 31 నుంచి స్వామివారి కల్యాణ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మండల స్థాయి పోటీలు గురువారం రాత్రితో ముగియడంతో శుక్రవారం జిల్లా పోటీలు ప్రారంభించారు. జిల్లా స్థాయిలో 30 భజన మండలిలు పాల్గొంటున్నట్లు ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా గుణ్ణం శారదాదేవి, అమలకంటి చంటిబాబు, పెండ్యాల నాగేశ్వరరావు వ్యవహరిస్తున్నారు. ఈ నెల 5న కల్యాణ ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని విజేతలకు బహుమతులు అందజేస్తామని నాగేశ్వరరావు తెలిపారు.

మరిడమ్మకు పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ తల్లికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: హెల్మెట్ ధారణపై జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ కాకినాడలోని సర్పవరం కూడలి నుంచి భానుగుడి వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది హెల్మెట్లు ధరించి ద్విచక్రవాహనాలు నడిపారు. భానుగుడి కూడలిలో ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రజలు తమ వంతు బాధ్యతగా హెల్మెట్లు ధరించాలని కోరారు.

యాన్యువల్ రిఫరెన్స్ కోర్స్ ప్రారంభం

కాకినాడ రూరల్: కాకినాడ మూడవ బెటాలియన్ ఏపీఎస్పీ క్యాంప్‌లో జి కంపెనీ సిబ్బందికి యాన్యువల్ రిఫరెన్స్ కోర్స్ ప్రారంభించారు. ఎస్పీ, ఏపీఎస్పీ కమాండెంట్ ఎం.రవీంద్రనాథ్ బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సిబ్బంది వారి కుటుంబాలకు దగ్గరగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ కోర్సును అన్ని బెటాలియన్లలో మొదలుపెట్టినట్టు తెలిపారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటానికి ఈ కోర్సు సహాయపడుతుందన్నారు. అడిషనల్ కమాండెంట్ సీహెచ్ భద్రయ్య, అడిషనల్ డీసీపీ ఎల్. అర్జున్,అసిస్టెంట్ కమాండెంట్ కె.శివ పోతురాజు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

కాకినాడ రూరల్: కత్తిపూడి–పామర్రు జాతీయ రహదారిపై పండూరు జంక్షన్ వద్ద సర్కిల్ పోలీసులు శుక్రవారం రాత్రి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టారు. సీఐ శ్రీనివాస్, తిమ్మాపురం ఎస్సై నాగార్జునరాజు, సిబ్బంది హైవే కూడళ్లలో మితిమీరిన వేగంతో వచ్చే వాహనాలను ఆపి వాహన చోదకులకు అవగాహన కల్పించారు.

6న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఆరో తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. విప్రోలో నాన్‌వాయిస్ ప్రాసెస్, హోమ్ కంఫర్ట్స్ ఫర్నిచర్‌లో అకౌంట్స్, సూపర్‌వైజర్, కేపిటల్ కన్సల్టెన్సీలో టెలికాలర్స్, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ, హోండాయ్ మోబీస్‌లో టెక్నీషియన్, హీల్ మై ఫ్యామిలీ హెల్త్‌కేర్ సర్వీసెస్‌లో కేర్ టేకర్స్, హెల్ప్ యువర్‌నీడ్స్.కామ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే డీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేలు వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులందరూ కాకినాడ వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లు, జెరాక్స్‌లతో హాజరు కావచ్చని పీడీ వివరించారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

కాకినాడ క్రైం: రాత్రి వేళల్లో రోడ్లపై నడుస్తూ ఫోన్ మాట్లాడే వారి చేతి నుంచి సెల్‌ఫోన్లు లాక్కుని వెళ్లిపోతున్న దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ స్వామినగర్‌కు చెందిన 21 ఏళ్ల షేక్ నాగూర్, పర్లోవపేటకు చెందిన 22 ఏళ్ల పొట్టి చిన్నయ్య నుంచి ఏడు సెల్ ఫోన్లను, ఇంద్రపాలేనికి చెందిన 20 ఏళ్ల రాలి మహేష్ విష్ణు, 21 ఏళ్ల సమ్మంగి నవీన్‌కుమార్ నుంచి ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎస్.రాంబాబు తెలిపారు. వ్యసనాలకు బానిసలై వరుస దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీసీఎస్ ఎస్‌ఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో నిఘా పెట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. సెల్‌ఫోన్ల విలువ సుమారు రూ.1.5 లక్షలని, నిందితులను శుక్రవారం జైలుకు తరలించినట్టు తెలిపారు.

మామిడి పూతపై మంచు వాత



విరగబూసిన మామిడి తోట

● తెగుళ్లపై రైతన్న ఆందోళన
● అప్రమత్తతతో మంచి దిగుబడి

పిఠాపురం: ఈ ఏడాది మామిడి, జీడి మామిడి రైతులను కలవరపెట్టినా పూత దశలో ఆశలు చిగురింపజేశాయి. ఎక్కడ చూసినా మామిడి పూత విరగబూసి కనిపిస్తుండగా మంచు ఎక్కువగా ఉండడంతో దిగుబడులపై ఆందోళన కలిగిస్తోంది. అధిక వర్షాలతో కొంత కాలం పూత లేక మామిడి చెట్లు వెలవెలబోగా ప్రస్తుతం విరగబూసి మామిడి చెట్లు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల పొగమంచు పెరగడంతో పాటు ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతుండడంతో పూత రాలి పోవడంతో పాటు మాడిపోయే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు మంగు తెగులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 2 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగవుతున్నాయి. ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో పూత ప్రారంభమవుతుంది. ఈ ఏడాది పూత ఆలస్యం అయ్యింది. మామిడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో అధికారులు తోటబడులు నిర్వహించి సస్యరక్షణ చర్యలు వివరిస్తున్నారు.

యాజమాన్యంతో తెగుళ్ల నివారణ



మామిడిలో తామర పురుగులు, తేనెమంచు పురుగుల నివారణకు తోటలను కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. వేప నూనె, క్రిమిసంహారకాలైన ఇమిడాక్లిప్రిడ్ 0.3 మిల్లీ లీటర్లు, మోనోక్రోటోఫాస్ 1 మిల్లీ లీటరు, ఎసిఫేట్ 1.5 గ్రాములు వంటి వాటిని మార్చి మార్చి చెట్టు అంతా తడిసేలా పూత నల్లబడిన తరువాత పిందె ఏర్పడే సమయంలో పిచికారి చేసుకోవాలి. మామిడి జీడి మామిడి తోటల్లో ఎటువంటి మార్పులు గమనించినా వెంటనే స్థానిక ఉద్యానవన శాఖ సిబ్బందిని సంప్రదించాలి. మామిడి పిందెలు బటాణి గింజ పరిమాణంలో ఉన్నప్పుడు 10 గ్రాముల యూరియా లీటర్ నీటిలో కలిపి 20 నుంచి 30 రోజుల కొకసారి మామిడి చెట్టు తడిసేలా పిచికారీ చేస్తే పిందె రాలడం తగ్గుతుంది. ముఖ్యంగా మామిడి తోటలు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి. ప్లనోఫిక్స్ హార్మోన్ 1 మిల్లీ లీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– కె.వెన్నెల, ఉద్యానవన శాఖ ఇన్‌చార్జి అధికారి, పిఠాపురం

ప్రతి లబ్ధిదారునికి పథకాలు చేరాలి

డీఎల్‌డీఓ నారాయణమూర్తి



సచివాలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

పిఠాపురం: ప్రతి లబ్ధిదారునికీ ప్రభుత్వ పథకాలు చేరేలా ఉద్యోగులు కృషి చేయాలని డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి సూచించారు. శుక్రవారం మండలం కుమారపురం గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. శాఖల వారీగా అధికారులతో సమీక్షించి పథకాల పంపిణీ తీరును తెలుసుకున్నారు. సిబ్బంది విధిగా యూనిఫాం ధరించాలని, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ, ఉపాధి హామీ పథకం అధికారులతో సమీక్షించారు. జగనన్న కాలనీల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాదగయ ఈఓగా శ్రీనివాస్



పాదగయ ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

పిఠాపురం: పాదగయ క్షేత్రం నూతన ఈఓగా శ్రీనివాస్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆయన సామర్లకోట భీమేశ్వరాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేసి పదోన్నతిపై ఈఓగా ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పాదగయ క్షేత్రంలో సుదీర్ఘ కాలం సూపరింటెండెంట్‌గా పని చేశారు. పాదగయ ఈఓగా పని చేస్తున్న సౌజన్య శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానానికి పూర్తి స్థాయి ఈఓగా పనిచేయనుండగా శ్రీనివాస్ పాదగయ ఈఓగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

వైస్ ఎంపీపీగా పేర్నిడి వెంకట్రాయుడు

● బాధ్యతల స్వీకరణ
● అభినందించిన దవులూరి దొరబాబు



వెంకట్రాయుడును అభినందిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: మండల వైస్ ఎంపీపీ–1గా గొంచాల గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు పేర్నిడి వెంకట్రాయుడు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఎంపీపీ–1 మలిరెడ్డి సూర్యావతి గత ఏడాది సెప్టెంబరు 24న గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జనవరి 27న ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. శుక్రవారం ఎంపీడీఓ డి.శ్రీలలిత అధ్యక్షతన, ఎన్నికల అధికారి కేఎస్‌వీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. మాధవపట్నంకు చెందిన ఎంపీటీసీ సభ్యురాలు మేడిశెట్టి దుర్గాదేవి పేర్నిడి వెంకట్రాయుడు పేరును ప్రతిపాదించగా, పీబీ దేవం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు మలకల సూర్యారావు బలపర్చారు. పోటీకి మరెవరూ లేకపోవడంతో వెంకట్రాయుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రసాదరావు ప్రకటించారు. ఈ మేరకు రాయుడుకు ఎన్నిక ధ్రువపత్రం అందజేయగా, వైస్ ఎంపీపీ–1 బాధ్యతలు స్వీకరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. తనకు అవకాశం ఇచ్చిన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుకు, సహకరించిన ఎంపీటీసీ సభ్యులకు రాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృత, ఎంపీడీఓ డి.శ్రీలలిత, పరిపాలనాధికారి వీవీ సాయిబాబు, ఎన్నికల అధికారి ప్రసాదరావు, సొసైటీ అధ్యక్షులు వీరంరెడ్డి నాని, మలకల వరహాలబాబు, ఎంపీటీసీ సభ్యులు అభినందించారు. వెంకట్రాయుడు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఆయన్ని దొరబాబు అభినందించారు.

అందరికీ ఆదర్శం నాయకర్



మల్లాడి సత్యలింగం నాయకర్ వర్ధంతి సభలో పాల్గొన్న నాయకులు, అధికారులు

● చారిటీస్ చైర్మన్ కార్తీక్ నాయకర్
● ఘనంగా విద్యాదాత వర్ధంతి

కాకినాడ సిటీ: మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ వర్ధంతిని శుక్రవారం ఎంఎస్ఎన్ చారిటీస్‌లో నిర్వహించారు. 2500 మంది విద్యార్థులు, స్థానికులు, పెద్దలు పాల్గొన్నారు. సభకు చారిటీస్ చైర్మన్, వ్యవస్థాపక ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయకర్ మాట్లాడుతూ అందరి సహకారంతో సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు మాట్లాడుతూ అందరికీ ఆదర్శం విద్యాదాత నాయకర్ అన్నారు. కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ మాట్లాడుతూ 107 ఏళ్లుగా విద్యను అందిస్తున్న గొప్ప సంస్థ అని కొనియాడారు. మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నాయకర్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. 22, 23వ వార్డుల మాజీ కార్పొరేటర్లు మీసాల శ్రీదేవి, ఎంజీకే కిశోర్‌కుమార్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధి మా బాధ్యత అని, పాఠశాలలకు వెళ్లే రహదారి నిర్మాణం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిందని, ఆటస్థలం, ప్రహరీ నిర్మాణాలకు సహకరిస్తామన్నారు. కార్యనిర్వాహణాధికారి పి.బాబూరావు, అధికారులు పి నారాయణమూర్తి, కర్రి నారాయణరావు, పద్మశ్రీ, ప్రిన్సిపాళ్లు కె.అమరేశ్వరరావు, ఎస్.విజకుమారి, హెచ్ఎం ఎంఎస్ సుబ్రహ్మణ్యం, బి.గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

తూరంగిలో..

రూరల్ మండలం తూరంగి రాఘవేంద్రపురంలో మల్లాడి సత్యలింగం నాయకర్ సంక్షేమ సంఘం నాయకర్ వర్ధంతిని నిర్వహించింది. పేదలకు నూతన వస్త్రాలు, దుప్పట్లు, చీరలు, పంచెలు పంచారు. సుమారు 300 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. తూరంగి మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, టీడీపీ నాయకులు పిల్లి అనంతలక్ష్మి, పిల్లి సత్యనారాయణమూర్తి, వనమాడి వెంకటేశ్వరరావు, బొజ్జా సాంబశివరావు, సంఘం నాయకులు పెమ్మాడి శ్రీను, గరికిన పెద్దరాజు, కర్రి గంగాచలం, సబ్బతి ఫణీశ్వరరావు, ఆతం భద్రం తదితరులు నాయకర్ విగ్రహానికి నివాళులర్పించారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సేవ చేయండి



డీపీఆర్వో కార్యాలయాన్ని తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

కాకినాడ సిటీ: ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేసి, వాటిని లక్షిత వర్గాలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. శుక్రవారం ఆయన రామారావుపేట శేషగిరిరావువీధిలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని డీపీఆర్‌వోను అడిగి తెలుసుకున్నారు. మీడియా సంస్థల ప్రోత్సాహం, జర్నలిస్టుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, అమలు తీరును డివిజనల్ పీఆర్‌వో పి రవి ఆయనకు వివరించారు. సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా సేవలు అందించాలని కోరారు. పీఆర్‌వోలు కె.రవి, అజయ్, ఏపీ సూపర్‌వైజర్ ధర్మారాజు, ఏఐఈ సిద్ధాంతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అలుగుల సంబరం



సంబరంలో బుగ్గలకు శూలాలు గుచ్చుకున్న భక్తులు

కరప: మండలంలోని గొర్రిపూడిలో శుక్రవారం అలుగుల సంబరం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కరికాల భక్తులు ఈ సంబరాన్ని ఐదు దశాబ్దాలుగా చేస్తున్నారు. ఏటా భీష్మ ఏకాదశి రోజున బసవేశ్వరస్వామి ఆలయంలో ఈ కళ్యాణం నిర్వహిస్తారు. ఆదివారం రాత్రి ఆలయంలో పార్వతీ, పరమేశ్వరుల సంబరాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అదేరోజు సాయంత్రం నిప్పుల గుండాన్ని తొక్కుతారు. సంతానం లేనివారు నందిని ఎత్తుకుని నిప్పుల గుండం తొక్కితే సంతానం కలుగుతుందని విశ్వాసం.